
ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన హనుమాన్ దేవస్థానం ఈవో లావణ్య, ధర్మకర్తలు

ఆలయ అభివృద్ధికి సహకరిస్తా: ఎమ్మెల్యే

చంపాపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ దేవస్థానం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించనున్నట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆలయ ఈవోగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎన్. లావణ్య మగళవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అంజిరెడ్డి, బిల్లకంటి కిరణ్‌కుమార్‌గుప్తా, మేక సురేందర్‌రెడ్డి, బీసుకుంట్ల సతీష్‌గౌడ్, చీర తిరుమలేష్, మధుసాగర్, యాదగిరి, మధుసూధన్‌రెడ్డి, సురేష్‌గౌడ్, నారగోని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యాదిరెడ్డి

ఏఐటీయూసీ, భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభ

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ ఆర్‌ఎన్ఆర్ కాలనీలో ఏఐటీయూసీ, భవన నిర్మాణ కార్మిక సంఘం అబ్దుల్లాపూర్‌మెట్ మండల సంఘం మహాసభను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర్ హరిసింగ్‌నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ప్రతి నెల వారికి రూ.12 వేలను అందించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు ఉచిత విద్య, వైద్యం అందించాలన్నారు. 50 ఏళ్లు దాటిన కార్మికులకు నెలకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించాలన్నారు. ఏఐటీయూసీ, భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీలను ఎన్నుకున్నారు.


కర్మన్‌ఘాట్‌లోని పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠలో పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్ విశ్వనాథ్‌గౌడ్, కమిటీ సభ్యులు

పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ

చంపాపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లో నిర్మించిన పోచమ్మ ఆలయంలో మంగళవారం విగ్రహ ప్రతిష్ఠ చేశారు. చాముండేశ్వరీ గురుదత్తపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ కొడగండ్ల శ్రీరామశరణ్‌శర్మ గురూజీ ఆధ్వర్యంలో లక్ష్మీ గణపతి, నవగ్రహ హోమం నిర్వహించారు. పూజలో ఆలయ చైర్మన్ ఎరుకల విశ్వనాథ్‌గౌడ్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న హనుమాన్ దేవస్థానం ధర్మకర్త కిరణ్‌కుమార్‌గుప్తా

కర్మన్‌ఘాట్‌లో అన్నదానం

చంపాపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమని కర్మన్‌ఘాట్ శ్రీ హనుమాన్ దేవస్థానం ధర్మకర్త బిల్లకంటి కిరణ్ కుమార్‌గుప్తా అన్నారు. కర్మన్‌ఘాట్‌లో మంగళవారం అన్నపూర్ణ అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐదు వందల మందికి అన్నదానం చేశారు. సహకరించిన మంచుకొండ రామ్మూర్తి పద్మజ, లాస్య మంచుకొండ, చిన్న బిక్షమయ్యను వారు అభినందించారు. కార్యక్రమంలో అనంతుల రవిశెట్టి, పద్మనారాయణ, సంతోష్, కండె రాంనరేష్, రఘువీర్, కొండూరు రవి, చరణ్, కృష్ణయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.


సమావేశంలో కరపత్రాలను చూపుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

కేబుల్ వైర్ల తొలగింపును తక్షణమే నిలిపివేయాలి

- కేబుల్ టీవీ అండ్ ఇంటర్నెట్ సర్వీసెస్ ప్రొవైడర్స్ అసోసియేషన్

బర్కత్‌పుర, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ గ్రేటర్ పరిధిలోని విద్యుత్ స్తంభాలకున్న కేబుల్ వైర్లను తొలగిస్తూ వాటిపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది కుటుంబాలను వీధిపాలు చేస్తున్నదని తెలంగాణ కేబుల్ టీవీ అండ్ ఇంటర్నెట్ సర్వీసెస్ ప్రొవైడర్స్ అసోసియేషన్ ఆరోపించింది. కేబుల్ వైర్ల తొలగింపును తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేసింది. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డేగల సతీష్‌బాబు, ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, ఉపాధ్యక్షులు సలీమ్ మాట్లాడుతూ.. ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా విద్యుత్‌శాఖ అధికారులు గ్రేటర్ పరిధిలోని ఈసీఐఎల్, బండ్లగూడ, మాదాపూర్, లాలాగూడ, బేగంపేటతోపాటు పలు ప్రాంతాలలో కేబుల్ టీవీ వైర్లను తొలగించారని, దీనివలన కేబుల్, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయి ఆపరేటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విధి విధానాలను రూపొందిస్తే తాము విద్యుత్ స్తంభాలకు ట్యాక్స్ చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని, చెన్నై తరహాలో కేబుల్ వ్యవస్థను తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇంటర్నెట్ వ్యవస్థ కేబుల్ వినియోగదారులకు న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు జైపాల్, పూర్ణచందర్, శివాజీ, రమణ, సతీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి జైలు

రంగారెడ్డి కోర్టులు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి జైలు, జరిమానాతో పాటు బాధితురాలికి రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలని రంగారెడ్డి జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్టు జడ్జి తీర్పు చెప్పారు. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయినగర్‌కాలనీలో 2018 సంవత్సరంలో కృష్ణా జిల్లా భీమవరానికి చెందిన సంగెపు హనుమంతరావు(60) ఓ బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నిందితుడికి మూడు సంవత్సరాల జైలు, రూ.5 వేల జరిమానాతో పాటు బాధితురాలికి రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు.


ఆచార్య జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న ఉపకమిషనర్ తిప్పర్తి యాదయ్య, ఉద్యోగులు, సిబ్బంది


సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న ఉపకమిషనర్ సుజాత, డీఈ నీలిమ తదితరులు


ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీపీసీసీ ప్రచార కమిటీ కో-కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా


ఆచార్య కొత్తపల్లి జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హయత్‌నగర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్నప్రభ తదితరులు

ప్రొఫెసర్ జయశంకర్‌కు

ఘన నివాళి

ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ జోన్ బృందం (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ పరిధిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు బీఆర్ఎస్, కాంగ్రెస్, తెలంగాణ జన సమితి నాయకులు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జయశంకర్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని పలువురు అన్నారు.


ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకులు


చంపాపేటలో జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నేత వింజమూరి రాఘవాచారి, ముడుపు రాజ్‌కుమార్‌రెడ్డి తదితరులు


మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న తెలంగాణ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరులు



సంజీవయ్య పార్కు వద్ద విద్యార్థులకు మొక్కల పంపిణీ

హెచ్ఎండీఏ మొక్కల పంపిణీ షురూ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం హెచ్ఎండీఏ పరిధిలో వివిధ ప్రాంతాల్లో మొక్కల పంపిణీని ప్రారంభించారు. దాదాపు 45 నర్సరీల నుంచి కోటి మొక్కలను ఉచితంగా పంపిణీ చేయాలని అర్బన్ ఫారెస్టు విభాగం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం హెచ్ఎండీఏ పరిధిలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీలలో మొక్కలను పంపిణీ చేయడానికి ప్రణాళికలను సిద్ధం చేసి అమల్లోకి తీసుకొచ్చింది. వివిధ పార్కుల వద్ద, ఔటర్ రింగ్‌రోడ్డు టోల్‌బూత్‌ల వద్ద మొక్కలను ఉచితం అందజేశారు. వాహనాలను ఏర్పాటు చేసి కాలనీల్లో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. హెచ్ఎండీఏ నర్సరీల్లో అనేక రకాల పూలు, పండ్ల జాతుల మొక్కలున్నాయని, ముఖ్యంగా బంతి, మందార, మల్లె, ఎగ్జోరా, గ్లుమెరియా పూల మొక్కలు, నేరడు, జామ, దానిమ్మ, పనస తదితర పండ్ల మొక్కలు సిద్ధంగా ఉన్నాయని అధికారులు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు... మహిళ మృతి

సైదాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఓ బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన మాదన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాలాపూర్ రాయల్ కాలనీకి చెందిన రిటైర్డ్ ఏఎస్సై మహ్మద్ యూసుఫుద్దీన్ భార్య హిదాయత్ బేగం(60)తో కలిసి సైదాబాద్ ప్రధాన రహదారిపై హోండా యాక్టీవాపై వెళ్తున్నారు. శ్రీశైలం నుంచి వస్తున్న పికెట్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెనుకగా వచ్చి యాక్టీవాను ఢీ కొట్టింది, దీంతో బైకుపై వెనుక కూర్చున్న హిదాయత్ బేగం కిందపడిపోవడంతో బస్సు వెనుక టైర్ ఆమె పైనుంచి వెళ్లింది. తీవ్ర గాయాలపాలై అక్కడిక్కడే మృతి చెందింది. మాదన్నపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బస్సు డ్రైవర్ ప్రభాకర్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు మాదన్నపేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

తల్లీకుమారుడు అదృశ్యం

కొత్తపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ తన కుమారుడితో బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాని ఘటన ఎల్‌బీనగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుగులోతు బందేష్, గుగులోతు నిర్మల(27) దంపతులు, కుమారుడు విద్వాన్(04) ఎస్‌బీహెచ్ కాలనీలో ఉంటున్నారు. బందేష్ అంబులెన్స్ టెక్నీషియన్‌గా పనిచేస్తునాడు. జూన్ 5న అతడు విధులకు వెళ్లిపోయాడు. సాయంత్రం 3 గంటలకు అతడు ఆమెకు ఫోన్ చేశాడు. అతడి సోదరితో ఆమెకు జరిగిన గొడవను ప్రస్తావించాడు. అదే రోజు సాయంత్రం 7.30కు అతడు ఇంటికి వచ్చి చూస్తే నిర్మల, విద్వాన్ కనిపించలేదు. వెంటనే అతడు ఆమెను ఫోన్‌లో సంప్రదించే యత్నం చేస్తే ఫోన్ స్విచ్ఆఫ్ అయినట్లు గుర్తించాడు. ఆమె ఆచూకీ కోసం అతడు తెలిసిన వారిని, బంధువులనూ సంప్రదించినా ఫలితం దక్కలేదు. మంగళవారం అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గుగులోతు నిర్మల, విద్వాన్

ఎఫ్ఏబీఏ ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ సమ్మిట్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): లైఫ్‌సైన్స్ రంగంలో లేటెస్ట్ అప్డేట్స్‌పై అవగాహన కల్పించేందుకు ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్ (ఎఫ్ఏబీఏ) ఆధ్వర్యంలో నగరంలో ఇన్నోవేషన్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ ప్రొఫెసర్ పి.రెడ్డన్న తెలిపారు. సోమాజిగూడలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫెడరేషన్ ఆఫ్ ఫార్మా అంత్రప్రెన్యూర్స్ చైర్మన్ చక్రవర్తితో కలిసి ఆయన మాట్లాడారు. ఈనెల 16న రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్, 17న వేల్‌ట్యాంక్, 18 లైఫ్ సైన్సెస్ ఇన్నోవేషన్ క్లస్టర్ మీట్‌ను కలిపి మొత్తం మూడు ఈవెంట్లు హైదరాబాద్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లైఫ్ సైన్సెస్ రంగంలో విస్తృత సేవలు అందించిన వారికి బహుమతులు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న డీసీ సుజాత, కార్పొరేటర్ పవన్ కుమార్

మెరుగైన మధ్యాహ్న భోజనం అందించాలి

- డీసీ సుజాత, కార్పొరేటర్ పవన్ కుమార్

కొత్తపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన మధ్యాహ్న భోజన సదుపాయం ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ డీసీ సుజాత, కొత్తపేట కార్పొరేటర్ పవన్ కుమార్ సూచించారు. అన్నంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో వారు మంగళవారం కొత్తపేట జడ్పీహెచ్ఎస్‌ను సందర్శించారు. ప్రధానోపాధ్యాయుడు విజేందర్‌రెడ్డి సమక్షంలో వారు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. మూడు రోజులుగా అన్నంలో పురుగులు వస్తున్నాయని వంటవాళ్లకు, ఉపాధ్యాయులకు చూపించామని విద్యార్థులు వారికి తెలిపారు. ఇప్పటినుంచి పురుగులు లేని అన్నం పెట్టేలా జాగ్రత్తలు తీసుకోవాలని, వాడే బియ్యాన్ని పరిశీలించాలని డీసీ సుజాత, కార్పొరేటర్ పవన్‌కుమార్ ప్రధానోపాధ్యాయుడికి సూచించారు.


పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ నర్సింహ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు యాదగిరి

పాఠశాలలో సమస్యల పరిష్కారానికి కృషి: కార్పొరేటర్

వనస్థలిపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ రెవెన్యూ, ప్రెస్ కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సమాచారం అందుకున్న కార్పొరేటర్ మంగళవారం పాఠశాలను సందర్శించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని ప్రధానోపాధాయుడు యదగిరి కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


తహసీల్దార్ రవీందర్‌దత్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

మజీద్‌పూర్‌లో ప్రభుత్వ భూమిని కాపాడండి

- అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్‌కు సీపీఎం వినతి

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్‌లోని ప్రభుత్వ భూమిని కాపాడాలని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహ కోరారు. మంగళవారం తహసీల్దార్ రవీందర్‌దత్‌కు వినతి పత్రం అందజేశారు. మజీద్‌పూర్ సర్వే నంబర్ 306లోని ప్రభుత్వ భూమిని సితార, శ్రీశ్రీ రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారని ఆయన ఆరోపించారు. కోట్ల విలువచేసే ప్రభుత్వ భూమిని కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వ భూమిని సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చట్టపరమైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు శ్రీశైలం, ముతాలు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి చేయూత

సైదాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కంప్యూటర్ సైన్స్‌లో సీటు సంపాదించిన ఉప్పుగూడకు చెందిన పేద విద్యార్థి ఆదం నీలేష్‌కు అనంతలక్ష్మి ఫౌండేషన్ ద్వారా రూ.15 వేల చెక్కును మంగళవారం చంపాపేటలో చైర్మన్ పుల్లూరి ఉపేందర్ గుప్తా అందజేశారు. నీలేష్ ఉన్నత చదువులకు అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తమ ఫౌండేషన్ ద్వారా నిత్యం గాంధీ, ఉస్మానియా, నిలోఫర్ ఆస్పత్రుల వద్ద నిత్యాన్నదానాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యురాలు రాధిక తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న ఉపేందర్ గుప్తా

అక్రమ పార్కింగ్‌ను నియంత్రించండి

- బాలాజీనగర్ కాలనీ సంక్షేమ సంఘం

వనస్థలిపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తమ కాలనీకి ప్రధాన రహదారి అయిన సౌత్ ఈస్ట్ బేకరీ రహదారికి ఇరువైపుల వాహనాలు అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారని బాలాజీనగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీవాసులకు రాకపోకలు కొనసాగేవిధంగా తగు చర్యలు తీసుకోవాలనీ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మంగళవారం కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ ప్రధాన కార్యదర్శి ముడుపు సందీప్ రెడ్డి మాట్లాడుతూ బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తా సమీపంలోని బాలాజీనగర్, సాయిరామ్ కాలనీ, శ్రీనివాసపురం కాలనీలకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపుల వాహనాల పార్కింగ్ మూలంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు తమ కాలనీలకు రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామనీ వాపోయారు. అక్రమ పార్కింగ్ అరికట్టి కాలనీవాసుల రాకపోకలు జరిగేవిధంగా తగు చొరవతీసుకోవాలనీ కార్పొరేటర్‌ను కోరారు.


కార్పొరేటర్ లచ్చిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు


మూసారాంబాగ్‌లో మొక్కలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి



గుర్రంగూడలో వాటర్ ట్యాంకు వద్ద స్వచ్ఛదనం-పచ్చదనంలో పాల్గొన్న మేయర్ పారిజాతారెడ్డి, కార్పొరేటర్లు శంకర్, లక్ష్మారెడ్డి


మీర్‌పేట్‌లో స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా నీటి ట్యాంకును శుభ్రం చేయిస్తున్న అధికారులు

కొనసాగుతున్న 'స్వచ్ఛదనం-పచ్చదనం'

ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ జోన్ బృందం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ పరిధిలో 'స్వచ్ఛదనం, పచ్చదనం' కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మంగళవారం మూసారాంబాగ్ డివిజన్‌లోని ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ పార్క్‌లో జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 మూసారాంబాగ్ నోడల్ ఆఫీసర్ మురళీకృష్ణ, యూబీడీ సూపర్‌వైజర్ కృష్ణతో కలిసి ఆమె మొక్కలు పంపిణీ చేశారు.

- బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంకుల వద్ద 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమం నిర్వహించారు. మేయర్ చిగిరింత పారిజాతానర్సింహరెడ్డి పాల్గొని కార్పొరేటర్లు దడిగ శంకర్, గడ్డం లక్ష్మారెడ్డిలతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు.
- మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని పలు వాటర్ ట్యాంకులను మేయర్ దుర్గాదీప్‌లాల్, కమిషనర్ చంద్రశేఖర్ తదితరులు సందర్శించి వాటిని శుభ్రం చేయించారు.
- చంపాపేటలో దోమల నివారణ కోసం ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కార్పొరేటర్ సుజాతనాయక్ ప్రజలను కోరారు.
- మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని పలు వాటర్ ట్యాంకులను మేయర్ దుర్గాదీప్‌లాల్, కమిషనర్ చంద్రశేఖర్ తదితరులు సందర్శించి వాటిని శుభ్రం చేయించారు.
- కొత్తపేటలో డీసీ సుజాత మాట్లాడుతూ కుక్కలు వెంటపడితే పరుగు తీయకుండా, రాళ్లతో కొట్టకుండా, వాటి కళ్లలోకి చూడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.
- పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో, పసుమాముల ప్రభుత్వ పాఠశాలలో చైర్మన్ స్వప్నాచిరంజీవి, వైస్ చైర్ పర్సన్ చామ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తనయుడు అభిషేక్‌రెడ్డితో కలిసి మొక్కలను నాటారు.


పసుమాముల ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటి నీరు పోస్తున్న వైస్‌చైర్‌పర్సన్ స్వప్న తదితరులు


జిల్లెలగూడలో దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్, డీసీ జాకియా సుల్తానా